క్లుప్తంగా

సర్వే పకడ్బందీగా చేపట్టాలి



సి.బెళగల్‌లో జగనన్న ఆరోగ్య రక్షపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మిథున్‌రెడ్డి

సి.బెళగల్: మండలంలో ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య రక్ష సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ వలంటీర్లు, వైద్య సిబ్బందికి సర్వేపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 15న గ్రామ వలంటీర్లు అందరూ తమ పరిధిలోని ఇళ్లకు తిరిగి జగనన్న ఆరోగ్య రక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి, అనారోగ్యంతో వున్నవారిని గుర్తించాలన్నారు. అదేవిధంగా ఈ నెల 16న ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తించే ఇంటింటి సర్వేలో సాధారణ జబ్బులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణుల ఇతర ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి వారికి పరీక్షలు, వైద్యం తదితర అంశాలను నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఉమామహేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ మంగమ్మ, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

సి.బెళగల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని స్పందనలో అధికారులకు అర్జీలు సమర్పించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు రైతులు తహసీల్దార్ శేషఫణికు అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ (ఇన్‌చార్జ్ ఎంపీడీఓ) శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, ఐసీడీఎస్ సి.బెళగల్ సెక్టార్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సి.బెళగల్ : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షన సర్వసభ్య నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జరిగే సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు చెందిన ఆరు సెట్ల రిపోర్టులు, నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

డ్వామా సూపరింటెండెంట్‌గా బాధ్యతల స్వీకరణ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటియాజమాన్య సంస్థలో సూపరింటెండెంట్‌గా జవహర్ లాల్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇటీవల వరకు జిల్లా పశుసంవర్ధకశాఖ కర్నూలు డివిజన్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ... గజిటెడ్ మేనేజర్‌గా పదోన్నతి పొందారు. తొలుత ఈయనను విశాఖ పట్టణంలోని పశుసంవర్ధకశాఖ శిక్షణ కేంద్రానికి బదిలీ చేశారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థలో సూపరింటెండెంట్ పోస్టు ఖాళీగా ఉండటంతో... ఇక్కడ విధులు నిర్వహించేందుకు ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి అవకాశం కల్పించారు. డిప్యుటేషన్‌పై డ్వామాలో పనిచేసేందుకు పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్ కూడా అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ముందుగా డ్వామా పీడీ అమరనాథరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈయన ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్స్ ఉమ్మడి జిల్లా శాఖలో కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఇటీవలి వరకు నాన్ గజిటెడ్ సూపరింటెండెంటుగా కొనసాగిన ఆయన ఇప్పుడు గజిటెడ్ అధికారిగా పదోన్నతి పొందారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండల జి.సింగవరంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరవుతారన్నారు.

పాణ్యం : మండల పరిధిలోని భూపనపాడు గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి సోమవారం తెలిపారు. ఉదయం 8 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటరీలు, మండలస్థాయి అధికారులు పాల్గొనాలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు కల్చరల్: విద్యుత్ పురోగతి పనులు, మరమ్మతుల నిర్వహణలో భాగంగా మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ కర్నూలు డివిజన్ ఈఈ రమేష్ డీఈఈ రాజమోహన్‌రెడ్డి తెలిపారు. 33కేవీ ఫీడర్ పరిధిలోని గణేష్‌నగర్, సాయి విజయ్ కాలనీ, రెవెన్యూకాలనీ, పార్థసారథి టవర్స్, శ్రీవారి కుటీర్, జొహరాపురం రోడ్, నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ, రామ్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ముంచుకొస్తున్న గడువు

- అన్నింటికీ ఈ-క్రాప్ నమోదే ఆధారం
- పంటల నమోదుకు ఈ నెల 15 వరకే అవకాశం
- మండలంలో ఇప్పటి వరకు 15వేల ఎకరాల్లో నమోదు పూర్తి
- రైతులు తప్పనిసరిగా చేసుకోవాలంటున్న అధికారులు



లక్ష్మీపురం గ్రామంలో పంట నమోదును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

కల్లూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రైతుల అభివృద్ధి కోసం గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల అభ్యున్నతికి కృషి చేస్తోంది. పంట విత్తు నుంచి విక్రయం వరకు అన్ని సేవలు అక్కడే అందుతున్నాయి. సబ్సిడీపై ఎరువులు, మందులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. వివిధ రాయితీ పథకాలు, పంటల బీమా తదితర వాటికి ఈ-క్రాప్ నమోదునే ఆధారంగా తీసుకుంటారు. పంటల నమోదుకు ఈనెల 15వరకు మాత్రమే గడువుందని, రైతులు ఆర్బీకేల్లో సంప్రదించి త్వరగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

21,536 ఎకరాల్లో పంటల సాగు

మండల వ్యాప్తంగా దాదాపు 30వేల ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగుకు అనుకులమైన నేలల ఉన్నాయి. అయితే ఈ ఏడాది ఖరీఫ్‌లో 21,536 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. అందుల్లో పత్తి-11,056, కంది-3,469, మొక్కజొన్న-1,566, వేరుశనగ-262, పొదుతిరుగుడు-83, కొర్ర-164, ఉల్లి-1180, ఆముదం-752 ఎకరాల్లో సాగు అయ్యాయి.

15వేల ఎకరాల్లో ఈ పంట నమోదు పూర్తి

మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు అన్ని గ్రామాల్లో కలిపి 15వేల ఎకరాల్లో ఈ-పంట నమోదు పూర్తయిన్నట్లు అధికారులు చెప్పారు. ఇంకా చేసుకోని రైతులు సాగు చేసిన పంటలను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోని వీఏఏ, వీహెచ్‌ఏలను సంప్రదించి పంట నమోదు, ఈ-కేవైసీ ఈ నెల 15లోపు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రభుత్వం పథకాలు, సున్నా వడ్డీ, ఇన్‌పుట్ సబ్సిడి, పంట కొనుగోలు పథకాలు వర్తిస్తాయి.

రైతులు పంట నమోదు చేసుకోవాలి



రైతులు సాగు చేసిన పంటలను రైతు భరోసా కేంద్రాలోని వీఏఏలు, వీహెచ్‌ఏలను సంప్రదించి ఈనెల 15లోపు పంట నమోదు, ఈ-కేవైసీ చేసుకోవాలి. పంట నమోదు చేసుకున్న వివరాల ప్రకారమే ప్రభుత్వ రాయితీ పథకాలు మంజూరు అవుతాయి. పంట నమోదు చేసుకోని వారికి ఎలాంటి వ్యవసాయ రాయితీలు, పథకాలు వర్తించవు.

– శ్రీనివాసరెడ్డి, ఏఓ, కల్లూరు

రూ.15 వేలు ఇన్సూరెన్స్ వచ్చింది



పంట నమోదు చేసుకోవడం వల్ల గతేడాది నాకు ఇన్సూరెన్స్ కింద 15 వేల రూపాయాలు ఆర్థిక సహాయం ప్రభుత్వం అందించింది. ఈ ఏడాది 10 ఎకరాల్లో సొంత పొలంతో పాటు, 6 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి పంటలను సాగు చేశాను. వ్యవసాయ అధికారులు సూచించిన ప్రకారం పంట నమోదు చేసుకున్నాను.

– నారాయణరెడ్డి, రైతు, రెమదూరు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



కాంస్య పతకాన్ని అందుకుంటున్న సంజయ్‌రామ్

కోడుమూరు రూరల్: పట్టణానికి చెందిన విద్యార్థి సంజయ్‌రామ్ హర్యానాలోని ఎండీయా యూనివర్సిటీలో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు జరిగిన నేషనల్ సబ్ జూనియర్ గ్రాఫ్లింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో అండర్-13, 30కిలోల విభాగం రెస్లింగ్ (కుస్తీ) పోటీల్లో రాణించి కాంస్య పతకాన్ని సాధించాడు. కోడుమూరుకు చెందిన సాయిసాక్షిత్ అండర్-11, సంజయ్‌రామ్, ఎండీ వాసిక్‌లు అండర్-13 విభాగంలో ఏపీ తరపున ఆడగా, సంజయ్‌రామ్ రాణించి కాంస్య పతకాన్ని సాధించారు. సంజయ్‌రామ్ ప్రస్తుం స్థానిక శ్రీనివాస హైస్కూల్‌లో 7వ తరగతి అభ్యసిస్తున్నాడు. కాంస్య పతకాన్ని సాధించిన సంజయ్‌రామ్‌ను శ్రీనివాస హైస్కూల్ కరస్పాండెంట్ లక్ష్మన్న అభినందించారు.

న్యాయం, ధర్మం గెలిచింది



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- పలు పార్టీలు చంద్రబాబుకు మద్దతివ్వడం సిగ్గుచేటు

కర్నూలు (న్యూటౌన్): స్కిల్ స్కామ్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు చేయడంతో న్యాయం, ధర్మం గెలిచిందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. సోమవారం కర్నూలులోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూ.కోటి యాభై లక్షలు ఖర్చు చేసి ఢిల్లీ నుంచి స్పెషల్ ఫ్లైయిట్‌లో న్యాయవాదిని రప్పించి, కేసు వాదించినా ఏమీ చేయలేక పోయారన్నారు. అవినీతిపరుడు చంద్రబాబుకు దత్త పుత్రుడు పవన్ కల్యాణ్, సీపీఎం, సీపీఐ, ఎంఆర్‌పీఎస్ మందకృష్ణ మాదిగ మద్దతు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగితే పోరాడే కమ్యూనిస్టులు చంద్రబాబుకు సంఘీభావం తెలపడం సిగ్గుచేటని విమర్శించారు. గ్రామాల్లో దళితులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు అభివృద్ధి చెందారంటే కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతోనేనని స్పష్టం చేశారు. కోడుమూరు నియోజకవర్గంలో అభివృద్ధిపై తాను చర్చకు సిద్ధమని, దళిత ఎమ్మెల్యేగా తాను సవాల్ చేస్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రిపై మందకృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుపై 40 కేసులు ఉండగా అందులో 20 కేసుల్లో స్టే తీసుకున్నారని ఆరోపించారు. సమావేశంలో జెడ్పీటీసీ గిరిజోన్, సచివాలయ కన్వీనర్లు ప్రసాద్, శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగన్న, ఆదాం, మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు మేలు చేకూర్చేలా పాలన

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి
- గడివేములలో 'గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం'



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేకూర్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన గడివేముల సచివాలయం-2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి, పథకాలు అందుతున్నాయా? అని ఆరాతీశారు. అలాగే సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. గ్రామంలో వివిధ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని వెంట ఉన్న అధికారులను ఆదేశించారు.

అర్హత ఉంటే ఇంటి వద్దకే పథకాలు

అర్హత ఉంటే తమ ప్రభుత్వంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు నడుచుకుంటూ వస్తాయని ఎమ్మెల్యే అన్నారు. సీఎం జగన్ అభివృద్ధి, సంక్షేమాన్ని పారదర్శకంగా ప్రజలకు అందిస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా సంక్షేమాన్ని అందరికీ అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 95 శాతం హామీలను నెరవేర్చిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, ఉప సర్పంచ్ బాలచెన్ని, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, సింగిల్ విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, దేశం నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, మూల పెద్దమ్మ ఆలయ చైర్మన్ చిన్నన్న, వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టానికి ఎవరూ అతీతులు కాదు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: చట్టానికి ఎవరూ అతీతులు కాదని చంద్రబాబు అవినీతి బయటపడటంతోనే అరెస్టు చేసి రిమాండుకు తరలించారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం గడివేములలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నో కుంభకోణాలకు పాల్పడ్డారన్నారు. నలభై ఏళ్ల రాజకీయ ఇండస్ట్రీ, సత్యశీలుడు, నీతివంతుడు అని గొప్పలు చెప్పుకునే తిరిగే ఆయన తప్పు ఎట్టకేలకు బట్టబయలైందన్నారు. ఏ తప్పు చేసినా తనకు ఈ చట్టాలు, న్యాయస్థానాలు ఏం చేయలేవని విర్రవీగిన వారికి ఇదొక గుణపాఠమన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో నేరాలు, ఘోరాలు చేసి అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసి, కోర్టు స్టేలు తెచ్చుకుని తప్పించుకు తిరిగాడన్నారు. ఇప్పుడు పాపంపండి తొలిసారి కటకటాల పాలయాయడన్నారు. చేసిన తప్పుకు శిక్ష అనుభవించడం తప్పదన్నారు.

పిల్లలందరికీ టీకాలు వేయించాలి



చిన్నారులకు టీకా వేస్తున్న మేయర్ బీ.వై. రామయ్య

కర్నూలు(హాస్పిటల్): అర్హులైన చిన్నపిల్లలందరికీ ఇంద్రధనస్సు కార్యక్రమంలో టీకాలు వేయించాలని నగర మేయర్ బీవై. రామయ్య చెప్పారు. సోమవారం స్థానిక సి.క్యాంపులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండో విడత ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని మేయర్ బీవై రామయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 11వ తేది నుంచి 16వ తేది వరకు చిన్నపిల్లలు, గర్భిణులు ఏదైనా కారణాల వల్ల వ్యాధినిరోధక టీకాలు వేయించుకోని వారు ఈ రెండో విడత ఇంద్రధనస్సు కార్యక్రమంలో టీకాలు వేయించుకోవాలని సూచించారు. జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు టీకాలు వేయించుకోని వారిని గుర్తించి డ్యూ లిస్ట్ తయారు చేసుకుని వంద శాతం టీకాలు అందేటట్లు చూడాలని, ఆ వివరాలను యూ విన్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ దివ్య, డెమో ప్రమీలాదేవి, హెచ్ఈఈఓ శ్రీనివాసులుశెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, డీసీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నందికోలు ఉత్సవం



నందికోలు ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

కల్లూరు : స్థానిక శ్రీ ఈశ్వర వీరభద్ర స్వామి, శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణమాసంలో ఆఖరి (కడ) సోమవారం సందర్భంగా ప్రజలందరూ పాడిపంటలతో ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని నందికోలు ఉత్సవం నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, మహా నైవేద్యం నివేదన, మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు వీరశైవ లింగాయత్ సమితి వారి ఆధ్వర్యంలో సామూహిక సహపంక్తి భోజన కార్యక్రమం జరిగింది. సాయంత్రం నంది కోల గ్రామోత్సవం కల్లూరు పుర వీధుల్లో జరిగింది. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమితి అధ్యక్షుడు చంద్రశేఖరప్ప, సంఘం సభ్యులు పెద్ద లక్ష్మయ్య, కె.శంకరయ్య, మల్లయ్య, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల ప్రారంభోత్సవం



షాపుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు : స్థానిక శ్రీ చౌడేశ్వరి మాత దేవాలయం ప్రాంగణంలో దాతల సహకారంతో నిర్మించిన షాపులను సోమవారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 షాపుల నిర్మాణానికి సహకరించిన దాతలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పోలిశెట్టి వెంకటేశ్వర్లు, ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు వరప్రసాద్ రావు, బ్రహ్మేశ్వరయ్య, శంకర్, సువర్ణమ్మ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

కోడుమూరు రూరల్ : స్పందన కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ జయన్న తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా అశ్వర్థనారాయణ కల్యాణం



రావిచెట్టుకు, వేప చెట్టుకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గడివేముల: మండల పరిధిలో గడిగరేవుల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో సోమవారం అశ్వర్థనారాయణ (రావి చెట్టు వేప చెట్టుకు) కల్యాణం సోమవారం జరిపించారు. కల్యాణంలో ఉప సర్పంచ్ గొూదా ప్రసాద్ దంపతులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ హిందు సంప్రదాయంలో ఎన్నో వృక్షాలను దైవ సమానంగా భావిస్తూ పూజలు చేస్తుంటారు. రావి చెట్టులో నారాయణుడు ఉన్నాడని, వేప చెట్టును శ్రీ మహాలక్ష్మీగా పూజిస్తారన్నారు. ఈ రెండు వక్షాలను నూతన దంపతులు, సంతానం లేని వారు పూజించడం వలన సంతానం కలుగుతుందని విశ్వసిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి, శ్రీనివాసులు, గోవిందరాజులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడాపోటీలు

ఓర్వకల్లు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం కానున్నట్లు పాఠశాల హెచ్‌ఎం రామచంద్రారెడ్డి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగానికి చెందిన బాలబాలికలకు ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు క్రీడలు, ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. 12న వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడాంశాలను కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో, 14వ తేదీన కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, టెన్నికాయిట్స్ పోటీలు ఉంటాయన్నారు. ఏఏ పోటీలలో ఎంత మంది క్రీడాకారులు పాల్గొంటారనే వివరాలను ఎంట్రీ ఫారంలో నమోదు చేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9441508711 సెల్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

బంద్ విఫలం

కోడుమూరు: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో సీఐడీ అధికారులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడాన్ని నిరసిస్తూ టీడీపీ ఇచ్చిన బంద్ పిలుపు ప్రభావం సోమవారం కోడుమూరులో ఏమాత్రం కనిపించలేదు. ప్రజలు బంద్ పిలుపును ఏమాత్రం పట్టించుకోకుండా తమ పనులను తాము చేసుకోగా, ప్రైవేట్, ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా నడిచాయి.

గూడూరు: టీడీపీ ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపు గూడూరులో విఫలం అయ్యింది. రోజు వారిలాగానే దుకాణాలు, కార్యాలయాలు పని చేశాయి. టీడీపీ కార్యకర్తలు బంద్ పిలుపును పెద్దగా పట్టించుకోలేదు. ప్రజలు కూడా బంద్ గురించి చర్చించుకోలేదు. ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు యథావిధిగా తిరిగాయి.

కనపడని బంద్‌ప్రభావం

పాణ్యం : చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ టీడీపీ ఇచ్చిన బంద్ ప్రభావం మండలంలో కనిపించలేదు. ఉదయం నుంచే ఆర్టీసీ బస్సులు యాథావిధిగా తిరిగాయి. ఆపార్టీ కార్యకర్తలు ఎవరూ బయటకు రాలేదు. పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన ఇచ్చిన పిలుపు ఎక్కడా ఫలించలేదు. ఆర్టీసీ సర్వీసులు, దుకాణాలు, ఇతర ప్రభుత్వ పాఠశాలలు యాథావిధిగా నడిచాయి.

ఓర్వకల్లు : టీడీపీ అధిష్టానం పిలుపు మేరకు ఆ పార్టీ శ్రేణులు చేపట్టిన బంద్ ప్రభావం పెద్దగా కనిపించలేదు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్టీసీ బస్సులు, బ్యాంకింగ్ సేవలు యధావిదంగా పనిచేశాయి.

రెండు మట్టి లారీల పట్టివేత

కర్నూలు (న్యూసిటీ): పాణ్యం మండలంలోని తమ్మారాజుపల్లెలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న రెండు లారీలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. పట్టుబడిన లారీల యజమానులు మట్టిని ఎంత మేర తరలిస్తున్నారో అంచనా వేసి ఒక్కొక్క లారీకి రూ.20 వేల చొప్పున రూ.40 వేలు అపరాధ రుసుం విధించినట్లు సోమవారం విలేకరులకు వెల్లడించారు. ఎవరైనా లైసెన్స్, అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు క్యాన్సర్ స్క్రీనింగ్ హెల్త్ క్యాంప్

పాణ్యం : స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం ఉదయానంద ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఆరోగ్యమిత్ర సుందర్ సోమవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. క్యాన్సర్‌కు సంబధించిన లక్షణాలు ఉన్న వారు ఎవరైన ఉంటే స్క్రీనింగ్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఏసీపీకి అదనపు బాధ్యతలు

కర్నూలు (టౌన్): నగర పాలక పట్టణ ప్రణాళిక విభాగంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న రంగస్వామికి అదనపు బాధ్యతలు అప్పగించారు. మరొక అసిస్టెంట్ సిటీ ప్లానర్ హాయత్ మొహీద్దీన్ అనారోగ్య కారణాలతో ఈనెల 21 వ తేదీ వరకు మెడికల్ లీవ్ పెట్టారు. దీంతో పాలన పరంగా ఇబ్బందులు రాకుండా రంస్వామికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం సాయంత్రం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఉత్తర్వులు జారీ చేశారు.